విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

## పోలీసుల అదుపులో దొంగ నోట్ల ముఠా

తిరుపతి ,తిరుపతికి చెందిన దొంగ నోట్లు తయారీ ముఠాను పుత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ రవికుమార్ ఈ కేసుకు సంబంధించి న వివరాలను మీడియాకు వెల్లడించారుతిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లిలోని తులిప్ రెసిడెన్సీ వద్ద గల రమేష్ తన ఇంటిలోని భార్య సంధ్య కూతురు నిషా స్నేహితుడు మునికృష్ణారావు లతో కలిసి దొంగ నోట్లు తయారు చేస్తున్నారు. యూట్యూబ్ ఛానల్ ద్వారా దొంగ నోట్లు ఎలా తయారు చేసే విధా నాన్ని నేర్చుకొని అందుకు తగిన పరికరాలను సమకూర్చుకున్నారు. మూడు నెలలు పాటు దొంగ నోట్లు తయారీని ప్రాక్టీస్ చేశారు. తర్వాత గత మూడు నెలల్లో 500 నోట్లను సుమారు 10 లక్షల మేరకు తయా రుచేశారు. వీటిని తిరుపతి శ్రీకాళ హస్తి, నెల్లూరు, వెంకటగిరి, చిత్తూ రులో చలామణి చేశారు. చివరగా పుత్తూరులో పట్టుబడ్డారు.




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 12-11-2024 సంపుటి : 06 సంచిక : 45 పేజీలు : 8 వెల : రూ 3-00

# ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

## కర్ణాటక సీఎం సిద్ధరామయ్య డిమాండ్



బెంగళూరు, నవంబర్ 11(: కర్ణాటక ఎక్సైజ్ శాఖలో రూ. 700 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ .. ఆ ఆరోపణలను నిరూపించాలని కర్ణాటక సీఎం సిద్ధరామ య్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ సవాల్ విసిరారు. ఆరోపణలు నిజమని రుజువైతే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. నిరూపించలేక పోతే మోదీ రాజకీయాల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, రెండు రోజుల క్రితం మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ మాట్లా డుతూ.. కర్ణాటక ఎక్సైజ్ శాఖలో భారీ కుంభకోణం జరిగిందని, ఆ సొమ్మును మహారాష్ట్ర, ఝార?ండ్‌లో ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ వాడుకుంటోందని ఆరోపించారు. 'ఎక్కడ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే.. ఆ రాష్ట్రం కాంగ్రెస్ రాజ కుటుంబానికి డబ్బులు అందించే ఏటీఎంగా మారిపోతుంది. ఇప్పుడు కాంగ్రెస్ రాజ కుటుంబానికి తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు ఏటీఎంలుగా మారిపోయాయి. మహారాష్ట్రలో ఎన్నికలు జరుగుతుంటే తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ వసూళ్లకు పాల్పడుతున్నది. మహారాష్ట్రలో ఎన్నికల కోసం తెలంగాణ, కర్ణాటక లో వసూళ్లు రెట్టింపయ్యాయని ప్రజలు చెప్తున్నారు.

# రూ. 2.94 లక్షల వార్షిక బడ్జెట్

అమరావతి నవంబర్ 11(ఆంధ్రరేఖ. ప్రతినిధి) 2.94లక్షల కోట్లతో రాష్ట్ర వార్షిక బడ్జెట్ ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సోమ వారంశాసనసభలో ప్రవేశపెట్టారు.రెవెన్యూ వ్యయం అంచనా రూ. 2.34లక్షల కోట్లు..ద్రవ్యలోటు రూ.68,743 కోట్లు, రెవెన్యూ లోటు రూ.34,743 కోట్లు.. పంచా యతీరాజ్ గ్రామీణా భివృద్ధికి రూ. 16.739 కోట్లు,జలవనరులు రూ.16,705 కోట్లు.. ఉన్నత విద్య రూ.2326 కోట్లు..పట్టణాభివృద్ధి రూ.11490 కోట్లు.. పరిశ్రమలు, వాణిజ్యంరూ.3,127కోట్లు.. ఇంధనరంగం రూ.8,207 కోట్లు..పోలీస్ శాఖ రూ. 8495 కోట్లు..బీసీ సంక్షేమం రూ.3,907 కోట్లు..మైనారిటీ సంక్షేమం రూ.4,376 కోట్లు..ఎస్టీ సంక్షేమం రూ.7,557 కోట్లు..అటవీ పర్యావరణ శాఖ రూ.687 కోట్లు..గృహ నిర్మాణంరూ. 4,012 కోట్లు..నైపుణ్యాభివృద్ధి శాఖ రూ.1,215 కోట్లు.మంత్రి మాట్లా డుతూ సమాచార విప్లవాన్ని వినియోగించుకోవాలి. శాశ్వత రాజధాని లేకుండా రాష్ట్ర విభజన జరిగింది. రాష్ట్రాన్ని పునర్మిర్మాణ దిశగా నడిపించే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంది. గత ప్రభుత్వం నీటి పారుదల రంగాన్ని పూర్తిగా విస్మరించింది. గత ప్రభుత్వం పోలవరం నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లలేదు. గత ప్రభుత్వం ఉత్పాదక మూలధనాన్ని నిలిపివేసింది. తద్వారా ఉత్పత్తి తగ్గిపోయి అభివృద్ధికి ఆటంకం కలిగిందని



అన్నారు.దీపం పథకానికి రూ.895 కోట్లు కేటాయించాం. దీపం పథకం ద్వారా 5 లక్షల మందికి లబ్ధి కలుగుతుంది. వచ్చే మూడేళ్లలో 18 వేల మంది అధ్యాపకులకు శిక్షణాభివృద్ధి కార్యక్రమం చేపడతాం. పాఠశాల

విద్యాశాఖకు రూ.29,909 కోట్లు కేటాయించాం. ఉపాధ్యాయులపై యాప్ భారం తగ్గింపు వుంటుంది. 192 నైపుణ్య కేంద్రాలు, కళాశాలల ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

# సీజేఐగా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ సంజీవ్ ఖన్నా



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తి గా జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో ఉదయం 10 గంటలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీ కాలం నిన్నటితో ముగిసిన విషయం తెలిసిందే. దీంతో తదుపరి సీజేఐగా సంజీవ్ ఖన్నా ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మాజీ సీజేఐ డీవై చంద్రచూడ్, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, మనోహర్ లాల్ ఖట్టర్ తదితరులు హాజరయ్యారు. కాగా, భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆరు నెలలు మాత్రమే ఉంటారు. ఆయన 2025 మే 13న పదవీ విరమణ చేస్తారు.న్యూఢిల్లీలో 1960, మే 14న జన్మించిన సంజీవ్ ఖన్నా ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయశాస్త్రాన్ని చదివారు. ఢిల్లీ హైకోర్టులో 2005లో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2006లో శాశ్వత జడ్జి అయ్యారు. 2019, జనవరి 18న సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టు జడ్జిగా ఆయన పలు ప్రముఖ తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. ఎన్నికల బాండ్లను రద్దు చేయడం, ఈవీఎంలు విశ్వసనీయమైనవని ప్రకటించడం, 370 అధికరణ రద్దును సమర్థించడం, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం లాంటి కీలక తీర్పులు ఇచ్చిన ధర్మాసనాల్లో జస్టిన్ ఖన్నా భాగస్వామిగా ఉన్నారు.

# భారీగా వ్యవసాయ బడ్జెట్.. కేటాయింపు



అమరావతి నవంబర్ 11( ,ఏపీ అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాసన సభలో ప్రవేశపెట్టిన అనంతరం అచ్చెన్నాయుడు వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రూ.43,402 కోట్లతో ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు.ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రానికి వ్యవసాయం వెన్నెముకలాంటిదని తెలిపారు. 62 శాతం జనాభా వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. కానీ గత ప్రభుత్వం వ్యవసాయాన్ని పూర్తిగా గాలికొదిలేసిందని విమర్శించారు. రైతు అభ్యున్నతే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, రైతులకు ఆధునిక పనిముట్లు, రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తామని చెప్పారు. వడ్డీ లేని రుణాలు, భూసార పరీక్షలకు ప్రాధాన్యతనిస్తామని తెలిపారు.

# గిరిజన మహిళను పెళ్లి చేసుకుంటే.. భూ బదలాయింపు ఉండదు: కేంద్ర మంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ: నవంబర్ 11( జార్ఖండ్‌కు చెందిన గిరిజన మహిళను ఎవరైనా చొరబాటుదారులు పెళ్లి చేసుకుంటే, వాళ్లకు పట్టా భూములను ఇవ్వబోమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా(ంఎతిబి ూష్ట్రజీస్త్ర) తెలిపారు. సెరైకేలాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఒకవేళ బీజేపీ అధికారంలోకి వస్తే, చొరబాటుదారులకు భూమి బదలాయింపును నిలిపివేసే చట్టాన్ని రూపొందించనున్నట్లు చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి వలన వస్తున్న వారిని చొరబాటుదారులు భావిస్తే మంత్రి ఆ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.మన కూతుళ్లను పెళ్లి చేసుకున్న చొరబాటు దారులు మన భూమిని లాక్కుంటున్నారని, గిరిజన మహిళను పెళ్లి చేసుకుంటే జరిగే భూ బదలాయింపు ప్రక్రియను అడ్డుకునేందుకు చట్టాన్ని తేనున్నట్లు చెప్పారు. చొరబాటుదారుల్ని గుర్తించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తామని, ఆ చొరబాటు దారుల నుంచి భూమిని తిరిగి లాక్కుంటామని మంత్రి పేర్కొన్నారు. బంగ్లాదేశీ చొరబాటుదారులకు జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ మద్దతు నిలుస్తున్నాయని ఇటీవల ప్రధాని మోదీ కూడా తన ప్రసంగంలో ఆరోపించారు.

# మొహబ్బత్ కా దుఖాన్ అంటూ.. మైనార్టీ పేదలపై విరుచుకుపడుతున్న కాంగ్రెస్ సర్కార్: కేటీఆర్

హైదరాబాద్: నవంబర్ 11 తెలంగాణలో హిందూ, ముస్లింల సహృద్భావం దేశానికే ఆదర్శంగా నిలిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో గంగాజమున తెహజీబ్ పాలన సాగిందని చెప్పారు. ఒకరినొకరు గౌరవించుకునే, సంస్కరించుకునే మంచి వాతావరణం ఉండేదని తెలిపారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకల్లో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గురుకులాలు ఏర్పాటు చేసి మైనారిటీ పిల్లల దశను మార్చారన్నారు. మైనార్టీ విద్యార్థులను ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్దారని చెప్పారు.గత ప్రభుత్వంలో 2751 మంది విద్యార్థులకు రూ.20 లక్షల చొప్పున స్కాలర్‌షిప్ ఇచ్చామని వెల్లడించారు. నాంపల్లి అనీస్ ఉల్ గుర్బా అనాథ శరణాలయానికి రూ.200 కోట్ల విలువైన 2 ఎకరాల భూమి ఇచ్చామని గుర్తుచేశారు. రూ.37 కోట్లతో ఆధునిక భవనాలు నిర్మించి ఇచ్చామని చెప్పారు. మైనార్టీ సంక్షేమానికి రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా షాదీ ముబారక్ పథకం చేపట్టామన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఇమాం, మౌజమ్‌లకు నెలకు రూ.5 వేలు ఇచ్చామని చెప్పారు.



మహమూద్ అలీని తెలంగాణకు తొలి డిప్యూటీ సీఎంను చేశామని వెల్లడించారు. వరంగల్‌కు తొలిసారి ముస్లింకు డిప్యాటీ మేయర్ ఇచ్చామని తెలిపారు. మొహబ్బత్ కా దుఖాన్ అంటూ కాంగ్రెస్ సర్కార్ మైనార్టీ పేదలపై విమర్శించారు. మూసీ వెంట మైనార్టీల ఇండ్లను కూలుస్తున్నదని మండిపడ్డారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని మోసం చేసిందన్నారు. మైనార్టీ బడ్జెట్ రూ.4 వేల కోట్లు పెడతామని మోసం చేశారని, మైనార్టీలకు ప్రత్యేక సబ్‌ప్లాన్ తెస్తామని మాట తప్పారన్నారు.

## జగన్ రాకపోతే అసెంబ్లీ సమావేశాలేమీ ఆగవు : స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అమరావతి నవంబర్ 11 వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ అసెంబ్లీకి రాకపోతే అసెంబ్లీ సమావేశాలేమీ ఆగవని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని శాసనసభ స్పీకర్ చింతకాయలఅయ్యన్నపాత్రుడు అన్నారు. ఈ నెల 22 వరకు అసెంబ్లీ సమావేశాలుసీరియస్‌గా జరుగుతాయని ఆయన స్పష్టంచేశారు.మంగళవారం బడ్జెట్‌పై అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఎమ్మెల్యేలందరికీ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని అయ్యన్న చెప్పారు. శనివారం కూడా సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. బిల్లులు, చర్చలకు అనుగుణంగా కొన్ని రోజులు రెండు పూటలా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎవరి కోసమో అసెంబ్లీ సమావేశాలు ఆగవని ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా స్పష్టం చేసినట్లు తెలిపారు.ప్రజా సమస్యలపై బాధ్యతాయుతమైన చర్చ జరపడం ఎమ్మెల్యేల బాధ్యత అని సీఎం పేర్కొన్నట్లు అయ్యన్నపాత్రుడు చెప్పారు. 1995లో తెల్లవారుజామున 4 గంటలకు రాత్రి భోజనం చేసిన సందర్భాలు ఉన్నాయని ఈ సందర్భంగా అయ్యన్న గుర్తు చేశారు. ఎమ్మెల్యేలు విధిగా అసెంబ్లీకి హాజరవ్వాలని, చీఫ్ విప్, విప్‌లను మంగళవారం ఖరారు చేస్తామని సీఎం చెప్పినట్లు వెల్లడించారు.

# సంపాదకీయం

మంగళవారం 12-11-2024

## సౌత్ లో యూత్ పాలిటిక్స్....

దక్షిణాది రాజకీయాలు దేశంలోనే ప్రత్యేకం. ఎందుకంటే జాతీయ పార్టీలకు ఇక్కడ ప్రాధాన్యం ఉండదు. అన్ని చోట్లా ప్రాంతీయ పార్టీలే కీలకంగా వ్యవహరిస్తూ ఉంటాయి. ఈ ప్రాంతీయ పార్టీల నాయకత్వం సహజంగానే కుటుంబాల చేతుల్లో ఉంటుంది. ఒకరి తర్వాత ఒకరు ఆ కుటుంబం నుంచే వారసులుగా వస్తూంటారు. ఈ సారి దక్షిణాది రాష్ట్రాల్లో ఈ వారసులు ఉదయించడం కాస్త ఎక్కువగా ఉండనుంది. సీనియర్ నేతలంతా రిటైర్మెంట్ వయసు దగ్గర పడటంతో వారసుల్ని యువనేతల్ని ప్రోత్సహించబోతున్నారు. తెలంగాణలో రాజకీయాలు ఇప్పటికే స్పష్టమైన మార్పులు వస్తున్నాయి. రాజకీయాల్లో సూపర్ సీనియర్ అయిన కేసీఆర్ ఇక తెర వెనుకనే ప్రధాన పాత్ర పోషించే అవకాశాలు ఉన్నాయి. మరో నాలుగేళ్ల తర్వాత వచ్చే జమిలీ ఎన్నికల నాటికి ఆయన నేరుగా ఫీల్డ్ లోకి వచ్చే అవకాశాలు తక్కువగానే ఉండవచ్చు. మొత్తం బాధ్యత కేటీఆర్, కవితలకే అప్పగించవచ్చు. అందుకే ఇప్పటికే వారికి పూర్తి స్థాయిలో ప్రతిపక్ష పాత్ర పోషించేందుకు అవకాశం ఇస్తున్నారు. తను సలహాలకే పరిమితమవుతున్నారు. ముందు ముందు కొన్ని సార్లు ప్రజల ముందుకు వచ్చినా కీలక పాత్ర కేటీఆర్‌దే అవుతుంది. కాంగ్రెస్ పార్టీలోనూ రేవంత్ హవా కొనసాగనుంది. బీజేపీలో బండి సంజయ్ వంటి వారే కీలక పాత్ర పోషిస్తారు. అంటే సంప్రదాయ సీనియర్ నేతలు తెర వెనక్కి వెళ్లిపోయినట్లే. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబునాయుడు నాలుగు దశాబ్దాలుగా రాజకీయం చేస్తున్నారు. అప్పట్నుంచి ఆయనకు పోటీగా చాలా మంది వచ్చారు. నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇలా ప్రత్యర్థులు వస్తూనే ఉన్నారు. మరో వైపు చంద్రబాబు మాత్రమే ఉంటున్నారు. తాను మొదటి సారి సీఎం అయినప్పుడు జగన్ నిక్కర్లేసుకుని ఆడుకుంటూ ఉంటారని చంద్రబాబు సెటైర్లు వేస్తూంటారు. చంద్రబాబు రాజకీయాల్లో మాస్టర్. కాలానికి తగ్గట్లుగా యువతతో పోటీ పడుతూ ఆయన ఎప్పటికప్పుడు బౌన్స్ బ్యాక్ అవుతూనే ఉన్నారు. కానీ ఆయన వచ్చే ఎన్నికల నాటికి ఎంత యాక్టివ్ గా ఉంటారో చెప్పడం కష్టం. ఆయన వయసు అప్పటికి ఎనభై దరిదాపుల్లోకి చేరుతుంది. ప్రత్యక్ష రాజకీయాల్లోనే ఉన్నా.. ఇప్పటిలా ఆయన నేరుగా క్షేత్ర స్థాయి రాజకీయాలు చేయలేకపోవచ్చు. ఆ బాధ్యతను నారా లోకేష్ తసుకుంటున్నారు. ఇక వైఎస్ వారసుడిగా తెరపైకి వచ్చిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి .. ఇప్పటికే ఓ సారి సీఎంగా చేశారు. ముప్ఫై ఏళ్లు నిరాటంకంగా సీఎంగా ఉండాలని ఆయన అనుకన్నారు కానీ .. మొదటికే మోసం వచ్చింది. పవన్ కల్యాణ్ కూడా ఇప్పుడు రేసులో ఉన్నారు. కూటమిలో ఉన్నారు కాబట్టి ఆయన సీఎం పదవిపై ఏమీ చెప్పకపోవచ్చు కానీ రాజకీయాల్లో ఎవరి లక్ష్యమైన ఉన్నతమైన పదవే. అందుకే.. వచ్చే ఎన్నిల నాటికి చంద్రబాబు..తెర వెనుక కీలక పాత్ర పోషిస్తే..తెర ముందు మాత్రం లోకేష్, జగన్, పవన్ లే పోటీ పడనున్నారు. అంటే ఏపీలోనూ యూత్ రాజకీయం నడుస్తుందన్నమాట. తమిళనాడులో వారసత్వ రాజకీయాలకు చాలా ప్రత్యేకత ఉంది. జయలలితకు వారసులు లేకపోడవంతో అన్నాడీఎంకేకు యువనేతల కొరత వచ్చింది. కానీ కరుణానిధి వారసుడిగా స్టాలిన్ తెరపైకి వచ్చారు. ఇప్పుడు స్టాలిన్ వారసుడిగా ఉదయనిధి కూడా వచ్చేశారు. సినీ నిర్మాతగా, హీరోగా తమిళ సినీ పరిశ్రమలో మంచి పేరు తెచ్చుకున్న ఉదయనిధి తాత, తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని భవిష్యత్ డీఎంకే యువనేతగా ఎదుగుతున్నారు. మొదట డీఎంకే యువత విభాగానికి నాయకత్వం వహించారు. గత ఎన్నికల్లో అసెంబ్లీకి ఎన్నికయ్యారు. మంత్రి పదవి కూడా వచ్చింది. ఇప్పుడు ఏకంగా డిప్యూటీ సీఎం పోస్టులోకి వెళ్లిపోయారు. తన వారసుడిగా ఉదయనిధిని స్టాలిన్ అనధికారికంగా ఖరారు చేసినట్లే అనుకోవాలి. స్టాలిన్‌కు ఇప్పటికే వయసు 70 దాటిపోయింది. తమిళ రాజకీయాల్లోకి కొత్తగా దళపతి విజయ్ వస్తున్నారు. దళపతి విజయ్ సీనియర్ హీరో. ఆయనకు తమిళనాడు వ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. ఆయన భవిష్యత్ లో కీలక నేతగా ఎదిగే అవకాశం ఉంది. ఎందుకంటే.. తమిళనాట వ్యక్తి ప్రాధాన్య రాజకీయాలు ఎక్కువే. అలాగే ఉదయనిధి స్టాలిన్‌కు రాజకయంగా ఫాలోయింగ్ ఉంది. సినిమాల్లోనూ ఆయన మంచి పేరు తెచ్చుకున్నారు.కానీ విజయ్ లాగా మాస్ ఇమేజ్ వచ్చే సినిమాలు చేయలేదు. కానీ అనుచరులకు మాత్రం లోటు లేదు . అందుకే తమిళనాడులో వచ్చే రాజకయం అంతా ఈ ఇద్దరి మధ్య హోరాహోరీ పోరుతోనే ఉంటుంది. అంటే తమిళనాడులోనూ యువ రాజకీయమే నడవనుంది. దక్షిణాదిలో ఎంతో మంది సీనియర్లు దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిం చారు. ఇప్పుడు వారిలో చాలా మంది యాక్టివ్ గా ఉన్నట్లే. చంద్రబాబు నాయుడు, కేసీఆర్ , స్టాలిన్ వంటి వారు వచ్చే ఎన్నికలనాటికి క్షేత్ర స్థాయిలో ఇప్పుడున్నంత చురుకుగా పని చేయలేకపోవచ్చు. యువనేతలు మాత్రం రాజకీయ రంగాన్ని దున్నేయగలరు. వారసులే కాదు.. సొంతంగా రాజకీయాల్లోకి ఎదిగిన వారు కూడా తమదైన ముద్ర వేసే అవకాశం ఉంది.

## పిజిఆర్ఎస్ కు 195 దరఖాస్తులు

--జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



---విభారె న్యూస్ నంద్యాల భ్యూరో :-ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతిస్తున్న ప్రజా ఫిర్యాదులను నిర్ణీత కాల వ్యవధిలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. డిఆర్ఓ రాము నాయక్, నంద్యాల ఆర్డీఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యతనిచ్చి నిర్ణీత కాల వ్యవధిలో సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుండి ఇప్పటివరకు స్వీకరించిన 4239 దరఖాస్తులలో 3313 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. నిరీత కాలవ్యవధిలో పరిష్కరించాల్సిన 885 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బియాండ్ ఎస్ఎల్ఎ లో ఉన్న 44 దరఖాస్తులను కూడా వెంటనే పరిష్కరించాలన్నారు. సీఎమ్ఓ కార్యాలయపు ఫిర్యాదులు 18 మంది అధికారుల వద్ద పెండింగ్ లో వున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. పది మండలాలకు సంబంధించిన రెవెన్యూ దరఖాస్తులు వితిన్ ఎస్ఎల్ఎ లో పెండింగ్లో ఉన్నాయని సంబంధిత తాసిల్దారులతో ఆర్డివోలు సమీక్ష నిర్వహించి క్లియర్ చేయాలన్నారు. పాణ్యం, జూపాడుబంగ్లా, చాగలమర్రి మండలాలలో సరిగా రెడ్రెస్ చేయని కారణంగా కలెక్టర్ లాగిన్ లో రీఓపెన్ అయ్యాయని వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజా ఫిర్యాదులను పరిష్కరి ంచడం లో కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రతి జిల్లా అధికారి స్వయంగా ప్రజా ఫిర్యాదులను పరిష్కరించడంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. రీ ఓపెన్ అయిన 41 ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై ఎంపీడీఓలు, తాసీల్దారులు, మున్సిపల్ కమిషనర్లు నిఘా ఉంచి పనులు పురమాయించాలని కలెక్టర్ సూచించారు. ఏపీ సేవ సర్వీస్ లలో 1075 దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏ ఉన్నాయని ఆర్డీఓ, తాసిల్దారులు దృష్టి సారించి క్లియర్ చేయాలన్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో 195 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 85 ఫిర్యాదులు

--- జిల్లా ఎస్పీ. అధిరాజ్ సింగ్ రాణా.



- విభారె న్యూస్ నంద్యాల భ్యూరో నవంబర్ 11-నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఫిర్యాదిదారుల నుంచి 85 ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులతో చట్ట పరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.ఫిర్యాదులలో సివిల్ తగాదాలు, కుటుంబ కలహాలు అత్తారింటి వేధింపులు మొదలగునవి ఉన్నాయి.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ దూర ప్రాంతాల నుండి జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని వారు ప్రతి సోమవారం మీకు దగ్గరలోని పోలీస్ స్టేషన్, సర్కిల్ ఆఫీస్, డిఎస్పి కార్యాలయాల్లో జరిగే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చని వాటిని కూడా ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ గారు తెలియజేశారు.

## నిర్మాణాలకు భూసేకరణను పూర్తి చేయండి

---నంద్యాల జిల్లాను టాప్ ఫైవ్ లో వృంచండి

--జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




--విభారె న్యూస్ నంద్యాల భ్యూరో నవంబర్ 11-జాతీయ రహదారులు, రైల్వే నిర్మాణాలకు సంబంధించి పెండింగ్ లో వున్న భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని పీజిఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో ప్రగతి అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జాతీయ రహదారులు, రైల్వే నిర్మాణాలకు అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి కూడ సమీక్షిస్తున్నారని జిల్లాలో పెండింగ్లో ఉన్న భూసేకరణను పూర్తి చేసేందుకు ఆర్డీఓలు తాసిల్దార్లతో సమీక్షించి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. త్వరలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఉన్న నేపథ్యంలో అభివృద్ధికి సంబంధించి అన్ని పారామీటర్లలో రాష్ట్రంలో నంద్యాల జిల్లా టాప్ ఫైవ్ లో ఉండాలని... దిగువ పది జిల్లాలలో ఉంటే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అన్ని పారామీటర్లలో గ్రీన్ మార్క్ ఉండేలా పనులు చేపట్టి పూర్తి చేసేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉపాధి హామీలో లేబర్ మొబలైజేషన్, దినసరి వేతన రేటు పెంపు, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, హార్టికల్చర్ ప్లాంటేషన్ తదితర అంశాలలో వెనుకబడి ఉన్నామని వచ్చే గురువారం నాటికి వంద శాతం లక్ష్యం పూర్తి చేయాలని ఏపీడీలను కలెక్టర్ ఆదేశించారు. గోకులం షెడ్లు, పల్లె వనాలు, సోకు పిట్ల నిర్మాణాలకు మంజూరు తీసుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని కలెక్టర్ ప్రశ్నిస్తూ సంబంధిత ప్రతిపాదనలను వెంటనే పంపాలని కలెక్టర్ ఆదేశించారు.పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలలో మంజూరు అయిన 1026 సీసీ రోడ్ల నిర్మాణాలకు గాను 170 పనులు గ్రౌండ్ అయ్యి 33 పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన నిర్మాణాలన్నీ గ్రౌండింగ్ కావడంతోపాటు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రహదారుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడంతోపాటు 15 రోజుల పాటు క్యూరింగ్ కచ్చితంగా చేయాలని కలెక్టర్ సూచించారు. అపార్ ఐడి జనరేటర్ కు సంబంధించి విద్యార్థుల పుట్టిన తేదీ సర్టిఫికెట్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలని డీఈఓ, డివిఇఓ లను కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాలలో టాయిలెట్లు త్రాగునీటి వసతి, సోక్ పిట్ల నిర్మాణాల పనుల ప్రగతిలో వెనుకబడి ఉన్నామని ఇకపై రోజువారి ప్రగతిపై నివేదికలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాలలో వయసుకు తగ్గ బరువు, ఎత్తు లేని పిల్లలు 25 శాతం ఉన్నట్లు సర్వేలో వెల్లడైందని... ఇందుకు గల కారణాలను వైద్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ లు విశ్లేషించి నివేదికలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## క్యాన్సర్ పై విజయం స్క్రీనింగ్ తో సాధ్యం గోడ పత్రిక ఆవిష్కరణ



--విభారె న్యూస్ నంద్యాల భ్యూరో నవంబర్ 11-సోమవారం కలెక్టరేట్ లోని పీజిఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో ప్రగతి అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఉల్లాస్ పథకం కింద వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చదువుకున్న ఎస్ హెచ్ జి మహిళలను విద్యా వాలంటీర్లుగా గుర్తించి ఉచితంగా విద్య బోధించేందుకు చర్యలు తీసుకోవాలని డిఆర్డిఏ పిడి, ఎంపీడీఒలను కలెక్టర్ ఆదేశించారు. మొదటి విడతలో 26,000 మంది వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందని ఈ మేరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీశైలం పర్యటనను అధికారులందరూ టీం స్పిరిట్ తో విజయవంతం చేశారని ఇదే స్ఫూర్తి మున్ముందు కూడా కొనసాగించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమానికి గైరాజరైన కొంతమంది జిల్లా అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈనెల 14 నుండి అన్ని గ్రామాలలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికి తిరిగి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అందరికీ క్యాన్సర్ పరీక్షలు, క్యాన్సర్ పై విజయం - స్క్రీనింగ్ తో సాధ్యం అనే గోడపత్రికను జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ఆవిష్కరించారు.

## మహిళ ప్రాణాలు కాపాడిన వ్యక్తిని అభినందించిన ... జిల్లా ఎస్పీ శ్రీ జి. బిందు మాధవ్



విభారే.. నవంబర్. 11..కర్నూలు జిల్లా ప్రతినిధి మహిళ ప్రాణాలు కాపాడిన ఎమ్ . రాజేషన్ ను జిల్లా ఎస్పీ శ్రీ జి. బిందుమాధవ్ అభినందించి , నగదు రివార్డు అందజేశారు. ఈ సంధర్భంగా సోమవారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సిపిఎం కొట్టాలకు చెందిన ఎమ్. రాజేష్ ను, కర్నూలు ఒన్ టౌన్ కానిస్టేబుల్ కాశిం యాదవ్ ను శాలువతో సన్మానించి అభినందించారు. చాకచక్యంగా , సమయస్ఫూర్తిగా వ్యవహరించి మహిళ ప్రాణాలు కాపాడడంతో జిల్లా ఎస్పీ గారు వారి సాహసాన్ని అభినందించారు.కెసి కెనాల్ లో వరద ప్రవాహం లెక్కచేయకుండా సాహసోపేతంగా ఓ వ్యక్తిని కాపాడడం అభినందనీయమన్నారు.కర్నూలు , కల్లూరు ఎస్టేట్ కు చెందిన జంగం నిర్మలమ్మ(50 సం.రాలు) కుటుంబ సమస్యలతో కెసి కెనాల్ లో దూకింది. నీటి ప్రవాహంలో కొట్టుకొని పోతుండగా సిపిఎం కొట్టాలకు చెందిన ఎమ్. రాజేష్ కెనాల్ లో దూకి నిర్మలమ్మను కాపాడడం జరిగింది.నిర్మలమ్మను వెంటనే కర్నూల్ ఒన్ టౌన్ పోలీసుస్టేషన్ కు చెందిన కానిస్టేబుల్ కాశిం యాదవ్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్ళి మెరుగైన వైద్యం చేయించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉంది. ఈ కార్యక్రమంలో కర్నూలు ఒకటవ పట్టణ సిఐ రామయ్యానాయుడు ఉన్నారు.

## పట్టణ సీఐ సుదర్శన్ రెడ్డి అక్రమ బదిలీను ఆపాలి ప్రజా సంఘాలు..

విభారె న్యూస్ నవంబర్ 11 ఎమ్మిగనూరు. పట్టణంలో సిఐ సుదర్శన్ రెడ్డి బదిలీకు వ్యతిరేకంగా విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏపీ సీఐఎల్ గణేష్,నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రసన్నకుమార్ , ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రంగ స్వామి ,హెచ్ఆర్సీ రైట్ టు ఇన్ఫర్మేషన్ ట్రస్ట్ డివిజన్ అధ్యక్షులు అజిత్ కుమార్ ఆధ్వర్యంలో సిఐ బదిలీను ఆపాలని ఆందోళన చేపట్టారు.ముఖ్యంగా పట్టణ సిఐ సుదర్శన్ రెడ్డి ఎమ్మిగనూరుకు వచ్చి మూడు నెలలు అయ్యి





పట్టణంలో శాంతిభద్రతలు మెరుగుపరచారని,అలాగే గంజాయి,గుట్కా,జూదం, అసాంఘిక కార్యకరాకాలపై ఉక్కు పాదం మోపి అనిచివేశారని ఇటువంటి సీఐని మనం ఎప్పుడూ చూడలేదని నాయకులు పేర్కొన్నారు.కాబట్టి శాంతిభద్రతల పర్యవేక్షిస్తున్న ఇటువంటి సిఐ ను ప్రభుత్వం అక్రమ బదిలీ చేయడం సిగ్గుచేటనే కాబట్టి తక్షణమే సిఐ సుదర్శన్ రెడ్డి బదిలీను ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ ధల్ రాష్ట్ర కార్యదర్శి రంగయ్య చౌదరి, ఏఐటియుసి నాయకులు తిమ్మ గురుడు, వాల్మీకి నాయకులు యాపిలయ్య,ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విజయ్, మాల మహానాడు నాయకులు నరసన్న, ఉసేని, సిపిఎంఎల్ యోసేపు,మల్లెల గ్రూప్ సభ్యులు హనుమంతు, ఎర్రకోట అరుణ్,పరిగే రాజేష్,సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు సత్యన్న,బాలరాజు,బాబు, విద్యార్థి సంఘ నాయకులు ఖాజా, కృష్ణ,వుసేని , లక్ష్మన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏడాది తర్వాత మళ్లీ సాగర్ పై ఘర్షణ

గుంటూరు, నవంబర్ 11, ఏపీ, తెలంగాణ మధ్య మరోసారి నాగార్జున సాగర్ వివాదం నెలకొంది. తెలంగాణ అధికారులు కుడి కాల్వ వాటర్ రీడింగ్ నమోదు చేసేందుకు ప్రయత్నించగా, ఏపీ అధికారుల వారిని అడ్డుకున్నారు. దీంతో మరోసారి సాగర్ వివాదం తెరపైకి వచ్చింది. గతేడాది సరిగ్గా నవంబర్ లోనే సాగర్ పై ఘర్షణ తలెత్తింది.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య మరోసారి 'నాగార్జున సాగర్ వివాదం' రాజుకుంది. గత ఏడాది సరిగ్గా నవంబర్ లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజున నాగార్జున సాగర్ వద్ద యుద్ధ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. మళ్లీ నవంబర్ లోనే సాగర్ వివాదం తెరపైకి వచ్చింది. ఈసారి కుడి కాల్వ వాటర్ రీడింగ్ నమోదు వివాదానికి దారితీసింది. వాటర్ రీడింగ్ తీసేందుకు తెలంగాణ అధికారులు ప్రయత్నించారు. వీరిని ఏపీ ఇరిగేషన్ అధికారులు అడ్డుకున్నారు. దీంతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారింది. ఈ ఘటనపై కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు యాజమాన్యానికి తెలంగాణ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ వివాదంపై కేఆర్ఎంబీ ఇరు రాష్ట్రాల అధికారులకు సర్ది చెప్పింది. ప్రతిరోజు తెలంగాణ డ్యామ్ సిబ్బంది సాగర్ రైట్ కెనాల్ వాటర్ రీడింగ్ ను నోట్ చేసుకుంటారని తెలుస్తోంది. శనివారం కూడా తెలంగాణ అధికారులు యథావిధిగా రైట్ కెనాల్ వాటర్ రీడింగ్ కోసం వెళ్లగా...తెలంగాణ సిబ్బందిని ఏపీ డ్యామ్ సిబ్బంది అడ్డుకోవడంతో జల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది.గతేడాది నవంబర్ 28న నాగార్జున సాగర్ కుడికాల్వ నుంచి నీటిని విడుదల చేయడానికి ఏపీ ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రయత్నించారు. దీంతో ఏపీ, తెలంగాణ మధ్య తీవ్ర ఘర్షణ నెలకొంది. సాగర్ పదమూడు గేట్ల నుంచి ఏపీ ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేసేందుకు ప్రయత్నించారు. నీటి విడుదలను అడ్డుకునేందుకు తెలంగాణ పోలీసులు ప్రయత్నించగా... ఏపీ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో వీరి మధ్య తీవ్ర ఘర్షణ తలెత్తింది. డ్యామ్ కు ఇరువైపులా ముళ్ల కంచెలు వేసి...కొన్ని రోజులు ఎవరినీ అనుమతించలేదు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర జలశక్తి సంఘం, కేఆర్ఎంబీ అధికారులు రంగంలో దిగి పరిస్థితిని చక్కదిద్దారు. సరిగ్గా ఎన్నికల పోలింగ్ రోజున ఈ వివాదం నెలకొనడంపై అప్పట్లో అనుమానాలు తలెత్తాయి. అప్పట్లో ఏపీలో వైసీపీ, తెలంగాణ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నాయి. ఇరు ప్రభుత్వాలు స్నేహపూర్వకంగా ఉన్నా జల వివాదాలు పరిష్కారం కాలేదు.2014లో ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో... కృష్ణా, గోదావరి నదీ బోర్డులు ఏర్పాటు అయ్యాయి. అప్పట్లో శ్రీశైలం జలాశయాన్ని ఆంధ్రప్రదేశ్ కు, నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్వహణ తెలంగాణకు కేంద్ర జల సంఘం కేటాయించింది. అయితే ఈ నిర్ణయం సరిగ్గా అమలు కాలేదు. శ్రీశైలం ప్రాజెక్టు ఎడమ విద్యుత్తు కేంద్రాన్ని తెలంగాణ నిర్వహిస్తుంది. అటుగా ఏపీ అధికారులను అనుమతించడంలేదు. అలాగే నాగార్జున సాగర్ ప్రాజెక్టులో 26 గేట్లకు 1-13 గేట్లు తెలంగాణ, 14-26 గేట్లను ఏపీ నిర్వహిస్తుంది. కుడి కాల్వ నుంచి ఏపీకి నీళ్లను తెలంగాణ అధికారులే విడుదల చేస్తున్నారు. అయితే నీళ్ల విడుదల తరచూ రెండు రాష్ట్రాల మధ్య సమస్యగా మారింది.

నీటి విడుదలకు కృష్ణా బోర్డు ఆదేశాలు ఇచ్చినా తెలంగాణ అధికారులు నీళ్లు విడుదల చేయని సందర్భాలు ఉన్నాయి. ఉమ్మడి జలాశయాలను బోర్డుల పరిధిలోకి తీసుకురావాలని ఏపీ డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. దశాబ్దాలా తరబడి సాగర్ డ్యామ్ వివాదం నడుస్తోంది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం తెలంగాణకు కేటాయించిన వాటా ప్రకాటం నీటిని వినియోగించుకోవడంలో తమను అన్యాయం జరుగుతోందని తెలంగాణ వాదన. ఏపీకి కేటాయించిన వాటాతో పాటు అదనంగా నీటిని తరలించుకుపోతుందని తెలంగాణ ప్రభుత్వం ఆరోపిస్తుంది. ఉమ్మడి నల్గొండ సహా హైదరాబాద్ తాగునీటికి సాగర్ డ్యామ్ కీలకం. అత్యవసర సమయంలో సాగర్ టెయిల్ పాండ్ బ్యాక్ వాటర్ నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా తెలంగాణ విద్యుత్ ఉత్తత్తి చేస్తుంది. అయితే పలుమార్పు టెయిల్ పాండ్ కుడివైపు నీటిని ఏపీ ఖాళీ చేసిందనే విమర్శలు ఉన్నాయి.కృష్ణా నదీ జల వివాదాలపై 1969లో కేంద్రం బచావత్ ట్రిబ్యునల్ ను ఏర్పాటు చేసింది. ఈ ట్రిబ్యునల్ 1976 మే నెలలో తుది తీర్పు ఇచ్చింది. కృష్ణా నది బేసిన్ లో 811 టీఎంసీల నీటిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు కేటాయించారు. ఉమ్మడి ఏపీలో రాజారావు కమిటీ సిఫార్సుల మేరకు ఏపీ, తెలంగాణకు వేర్వేరుగా నీటి కేటాయింపుల ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం మేరకు తెలంగాణకు 293.96 టీఎంసీలు, ఏపీకి 512.04 టీఎంసీలు కేటాయించారు. ఏపీ, తెలంగాణ విభజన అనంతరం కూడా నీటి కేటాయింపులు ఈ ఒప్పందం ప్రకారమే జరుగుతున్నాయి. దీనిపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. నీటి కేటాయింపులో తమకు అన్యాయం జరుగుతోందని వాదన వినిపిస్తుంది. నీటి కేటాయింపుల క్యాచ్ మెంట్ ఏరియా, కరవు ప్రాంతాలు, బేసిన్ జనాభా, సాగు విస్తీర్ణం ప్రకారం జరగాలని తెలంగాణ కోరుతుంది. బచావత్ ట్రిబ్యునల్ నికర జలాల ఆధారంగా అప్పట్లో కేటాయింపు చేసిందని ఆరోపిస్తుంది. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులపై సమీక్షించాలని కోరుతుంది

# రెండు రాష్ట్రాల్లో పులి భయం

విజయనగరం, నవంబర్ 11, ఒడిశా సరిహద్దులో పులి సంచారం చేస్తుండడంతో ఆంధ్రాలో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. గత కొన్ని రోజులుగా గంజాం, గజపతి జిల్లాల్లో మహారాష్ట్ర నుంచి దారితప్పి వచ్చిన పులిని అక్కడ అటవీశాఖ అధికారులు గుర్తించారు. దీంతో బరంపురం సమిపాన జయంతి పురం వాసులు పులిని చూడడంతో ఆ ప్రాంత వాసుల్లో భయాందోళన నెలకొంది. అక్కడి ప్రజలు పులి ఎక్కడ వచ్చి దాడి చేస్తుందోనని బిక్కుబిక్కుమంటున్నారు.కొన్ని రోజులుగా గంజాం, గజపతి జిల్లాల్లో ప్రజల్ని మహారాష్ట్ర నుంచి వచ్చిన పులి భయం వెంటాడుతోంది. నవంబర్ 3న రాత్రి జాతీయ రహదారి దాటుతున్న పులి ఓ కారులో అమర్చిన కెమెరాకు చిక్కింది. ఆ ప్రాంతం గంజాం జిల్లా గొళంత్రా ఠాణా పరిధిలోని భలియాగడ వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిగా దాటుతున్న పులి సామాజిక మాధ్యమాల్లో వార్తలు వైరల్ అయ్యాయి. ఒడిశా అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పొలాల్లో పులి పాద గుర్తుల్ని అటవీ సిబ్బంది గుర్తించారు. దీంతో భలియాగడ, పల్లి, ఝింకిపదర్, ఘాటీకాళువ తదితర గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అటవీ శాఖ సిబ్బంది ఆయా గ్రామాల్లో మైకు ద్వారా ప్రచారం నిర్వహించి, ప్రజల్ని చైతన్యపరిచారు.పశువుల్ని మేతకు బయటకు వదలొద్దని, ప్రజలు సాయంత్రం నుంచి తెల్లవారే వరకు ఇళ్ల నుంచి బయటకు ఒంటరిగా రావద్దని వారు ప్రచారం నిర్వహించారు. మరోవైపు తన మేకను పులి చంపేసిందంటూ పొన్నాడ గ్రామానికి చెందిన సంబర మల్లిక్ వాపోయాడు. వరి కోతకు వచ్చిన సమయంలో రైతులు పంటల్ని అడవి పందుల నుంచి కాపాడుకునేందుకు రాత్రుళ్లు పొలాల్లో కాపలా ఉంటుంటారని, పులి భయంతో వారెవరూ పొలాలకు వెళ్లడం లేదని కుఠారసింగి ప్రాంతవాసులు వాపోతున్నారు.మ్యాటింగ్ సమయం వలన మరింత జాగ్రత్తగా ఉండాలని అటవీ అధికారులు చెబుతున్నారు. పులి సంచారం నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం సరిహద్దు వాసులను పలాస కాశీబుగ్గ రెంజ్ ఆఫీసరు మురళీ కృష్ణ అప్రమత్తం చేశారు. ఒడిశా బరంపురం ప్రాంతంలో పులి సంచరిస్తున్నందున శ్రీకాకుళం జిల్లా వైపు వచ్చే అవకాశం ఉండడంతో ముందస్తు చర్యలకు ఉపక్రమించారు. గట్టి నిఘా పెట్టామని, ప్రజలను అప్రమత్తం చేశామని మురళి కృష్ణ తెలిపారు.

# ఆ రెండు పార్టీల మధ్య సోషల్ వార్...

గుంటూరు, నవంబర్ 11, అధికార టీడీపీ, వైసీపీ మధ్య ట్వీట్ల వార్ నడుస్తోంది. అటు సోషల్ మీడియాలో దుష్ప్రచారం, దారుణమైన పోస్టింగ్ పెట్టిన వారిపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. సోషల్ మీడియాలో ట్రోలింగ్, దారుణమైన ప్రచారం, వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ చేసిన పోస్టులపై ఏపీ పోలీసులు ఫోకస్ చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత కూడా తాము సైతం బాధితులమేనని.. అందుకే వీటిని సీరియస్ గా తీసుకుని, బాధ్యతలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మరోవైపు వైసీపీ, టీడీపీ సోషల్ మీడియా వార్ కొనసాగుతోంది.సోషల్ మీడియాలో మురికి పోస్టులు పెడితే ఊరుకునేది లేదు.. చర్యలు తప్పవు.. ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే చర్యలు మొదలవుతున్నాయి. ఇప్పటికే 1500కు పైగా సోషల్ మీడియా అకౌంట్స్‌ను వివాదాస్పదమైనవిగా గుర్తించిన పోలీసులు.. 100 మందికి పైగా ఖాతాదారుల్ని అదుపులోకి తీసుకున్నారు. కేవలం నోటీసులిచ్చి వదిలేస్తారని భ్రమపడొద్దంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అటు.. మాజీ సీఎం జగన్‌పై ఫేక్ ప్రచారం చేస్తున్నారంటూ.. విశాఖలో నిరసనకు దిగారు వైసీపీ నేతలు. కేవలం టీడీపీ-జనసేన నేతలపై పెట్టిన పోస్టుల్నే చూడ్డం తగదని, జగన్‌పై సోషల్ మీడియాలో జరిగిన అసత్య ప్రచారం సంగతేంటని రివర్స్ గేర్ వేస్తోంది వైసీపీ. వైసీపీ నేతలపై జరిగిన ట్రోలింగ్ చూశారా అంటూ ఆధారాలతో సహా గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు చేశారు మాజీ మంత్రి అంబటి రాంబాబు. తమ కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని, తీవ్రవాదుల్లా హింసిస్తున్నారని ఆరోపించారు.ఎవర్నీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఏకంగా డీజీపీ నుంచే వార్నింగ్ వచ్చేసింది కనుక.. యాక్షన్ కూడా అదే రేంజ్‌లో మొదలైంది. రాష్ట్రస్థాయి ప్రముఖనేతల పర్సనల్ అసిస్టెంట్లకు సైతం నోటీసులు వెళ్లాయి. ఈ మొత్తం వ్యవహారాన్ని హోం మంత్రి అనిత దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. హైకోర్టులో వరుస కేసులు రిజిస్టర్ కావడంతో.. ముఖ్యమంత్రి సైతం ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుని రివ్యూ చేస్తున్నారు.సోషల్‌మీడియాలో అసభ్య పోస్టులు పెట్టే వాళ్లకు మరోసారి సీఎం చంద్రబాబు దిమ్మతిరిగే వార్నింగ్ ఇచ్చారు. ఆడబిడ్డల జోలికి వస్తే వదిలిపెట్టేది లేదన్నారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీలు రాజకీయ ముసుగులో ఉన్నారు.. వాళ్ల ముసుగులు తీస్తామన్నారు. లాలూచీ పడే అధికారులపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా తప్పుడు ధోరణితో ఉంటే.. ఇప్పటికైనా మానుకోండి.. మర్యాదగా ఉంటే మర్యాదగా ఉంటామంటూ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఫేక్ అడ్రస్‌లతో పోస్టులు పెట్టే వాళ్లను వదిలిపెట్టమని.. వైసీపీ నేతల కుటుంబాలపై పోస్టులు పెట్టినా వదిలిపెట్టమంటూ వార్నింగ్ ఇచ్చారు.నిక్కర్ మంత్రి లోకేష్, నువ్వు మంత్రివి ఎలా అయ్యావు? సీఎం కార్యాలయంలో పెన్నులు, పేపర్ల కోసం కోట్లు దుర్వినియోగం అంటూ దుష్ప్రచారం చేస్తున్న నిన్ను ఏ జైల్లో పెట్టాలి? నీకు ఏ శిక్ష వేయాలని వైసీపీ ఎక్స్ ఖాతాలో ప్రశ్నించింది. నీ బతుకంతా కూడా వైయస్ జగన్ పై, గత వైసీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమేనా? నిక్కర్ మంత్రీ.. ప్రతిసారీ నీ అజ్ఞానాన్ని ఇలా బయటపెట్టుకోవడానికి సిగ్గుగా లేదా? అని లోకేష్ ట్వీట్ కు వైసీపీ ఘాటు రిప్లై ఇచ్చింది. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం అంటే అక్కడే ఐదారుగురు ప్రిన్సిపల్ సెక్రటరీలు.. వాళ్ల దగ్గర స్టాఫ్ ఉంటారు. వారు రాష్ట్ర పరిపాలనను పర్యవేక్షిస్తుంటారు.ఏపీ మంత్రి నారా లోకేష్ ను నిక్కర్ మంత్రి అని వైసీపీ అధికారిక ఎక్స్ ఖాతాలో చేసిన పోస్ట్ దుమారం రేపుతోంది. మాజీ సీఎం జగన్ ను అసెంబ్లీ అంటే భయపడే పులివెందుల పిల్లి అని, కట్ డ్రాయర్ ఎమ్మెల్యే అంటూ టీడీపీ సైతం అదే స్థాయిలో బదులిచ్చింది. నీకు ఆత్రం ఎక్కువ తప్ప, ఏమి చెప్తున్నావో నీకే అర్థం కావటం లేదు.. ఒక పక్క పెన్నులు, పేపర్ల కోసం కోట్లు ఖర్చు పెట్టలేదు అని జగన్ అంటాడు, ఇంకో పక్క స్టాఫ్ ఎక్కువ ఉన్నారు కాబట్టి ఖర్చు పెట్టాను అంటావ్. బుర్రలో గుజ్జు పెంచుకునే మాత్రలు వాడాలని, రూ.9.84 కోట్లతో కొన్న పెన్నులతో స్క్రిప్ట్ ఎలా రాయాలో నేర్చుకోవాలంటూ టీడీపీ పోస్ట్ చేసింది. ఏపీ మంత్రి నారా లోకేష్ చేసిన ట్వీట్ తో టీడీపీ వర్సెస్ వైసీపీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇంతకీ నారా లోకేష్ ఏమన్నారంటే.. ఏపీ విద్యార్థులకు ఓ ప్రశ్న. మీరు వాడే పెన్ను ధర ఎంత ఉంటుంది చెప్పాలని లోకేష్ ప్రశ్న అడిగారు. వైఎస్ జగన్ అయితే తాడేపల్లి ప్యాలెస్ లో పేపర్లు, పెన్నులకు ఏకంగా రూ.98,400,000 (రూ.9 కోట్ల 84 లక్షలు) ఖర్చు చేశారు. ఈ మొత్తాన్ని సరిగ్గా ఖర్చు చేసింటే ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్ కు బాటలు పడేవని లోకేష్ ట్వీట్ చేశారు.ఏపీ సీఎంఓలో స్టేషనరీ, నాన్ స్టేషనరీ ఖర్చులు కలిపి మొత్తం రూ.9.84 కోట్లు ఖర్చు చేశారంట, వైఎస్ జగన్ నిజంగానే పెన్నుతో రాస్తున్నారని భావిస్తున్నారా అని లోకేష్ ఏపీ విద్యార్థులను అడుగుతూ మాజీ సీఎంపై సెటైర్లు వేశారు. ఈ ట్వీట్ వైసీపీ శ్రేణులకు ఆగ్రహం తెప్పించడంతో సోషల్ మీడియాలో ట్వీట్ వార్ మళ్లీ మొదలైంది.

# కుప్పం, హిందూపురం మున్సిపాల్టీలపై తమ్ముళ్ల గురి

అనంతపురం, తిరుపతి, నవంబర్ 11, రాయలసీమ జిల్లాల్లోని అన్ని మున్సిపాలిటీల్లో టీడీపీ జెండా రెపరెపలాడ్సిందేనంటూ తెలుగు తమ్ముళ్లు పావులు కదుపుతున్నారు. ముందుగా బావబామ్మర్దులు తమ నియోజకవర్గాల్లో అంతా సెట్ చేసి పెట్టారు. ఏ టైమ్‌లోనైనా పీఠం తమ వశం చేసుకునే అవకాశం ఉంది. సీఎం చంద్రబాబు సెగ్మెంట్‌లోని కుప్పం మున్సిపాలిటీలో పాలిటిక్స్ హాట్ హాట్‌గా మారాయి. ఛైర్మన్ పీఠం కోసం టీడీపీ..తమ సీటును నిలబెట్టుకునేందుకు వైసీపీకి ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి.కుప్పం మున్సిపాలిటీలో 25 వార్డులు ఉన్నాయి. 19 చోట్ల వైసీపీ, ఆరుచోట్ల టీడీపీ కౌన్సిలర్లు గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కుప్పంలో పొలిటికల్ సిచ్యువేషన్స్ మారిపోయాయి. నలుగురు మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. అందులో నుంచి మరో కౌన్సిలర్ తిరిగి వైసీపీకి లోకి వెళ్లారు. లేటెస్ట్‌గా కుప్పం మున్సిపల్ ఛైర్మన్ సుధీర్ అన్ని పదవులకు రాజీనామా చేసి టీడీపీ కండువా కప్పుకున్నారు.అయితే సుధీర్‌కు సంబంధించి మున్సిపల్ ఛైర్మన్ పదవికి రాజీనామానే పరిగణలోకి తీసుకున్నారు. కౌన్సిలర్ పదవికి రాజీనామాను మున్సిపల్ కమిషనర్ కన్సడర్ చేయలేదు. అయితే సుధీర్‌తో రాజీనామా చేయించి..గతంలో టీడీపీ మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా ఉన్న నేత భార్యకు అవకాశం కల్పించాలని టీడీపీ ప్లాన్ చేస్తోంది. ఇప్పుడు కుప్పం మున్సిపాలిటీలో టీడీపీకి 11, వైసీపీకి 14మంది సభ్యుల మద్దతు ఉంది. అయితే తమ సభ్యులు చేజారిపోకుండా ఎమ్మెల్సీ భరత్, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు.ఇక హిందూపురంలో బాలయ్య ప్లాన్ వర్కౌట్ అయింది. హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో మ్యాజిక్ ఫిగర్ దాటింది టీడీపీ. క్యాంపులో 22 మంది టీడీపీ కౌన్సిలర్లు, చైర్మన్ ఎన్నిక రోజున హైదరాబాద్ నుంచి నేరుగా హిందూపురానికి రానున్నారు. హిందూపురంలో మొత్తం 38 వార్డులు ఉండగా 22 మంది కౌన్సిలర్ల మద్దతు టీడీపీకి ఉంది.ఇప్పటికే హిందూపురంలో వైసీపీ మున్సిపల్ ఛైర్మన్‌గా ఉన్న ఇంద్రజ రాజీనామా చేసి టీడీపీలో చేరిపోయారు. 22 మంది కౌన్సిలర్లు రెండు రోజుల క్రితం క్యాంప్‌కు వెళ్లారు. కొత్త మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రోజున నేరుగా హైదరాబాద్ నుంచి హిందూపురంకు వచ్చి సంఖ్యాబలం నిరూపించుకుంటామని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.హిందూపురం మున్సిపాలిటీలో మొత్తం 38 మంది కౌన్సిలర్లు ఉండగా 30మంది వైసీపీ కౌన్సిలర్లు గెలుపొందారు. ఆరుగురు టీడీపీ తరపున గెలిచారు. ఒకరు బీజేపీ, మరొకరు ఎంఐఎం నుంచి గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు టీడీపీ సంఖ్యాబలం 6 ఉండగా వైసీపీ మున్సిపల్ చైర్మన్ ఇంద్రజతో పాటు మరో 9 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. దీంతో ఎంపీ, ఎమ్మెల్యే ఓటుతో కలిపి టీడీపీ సంఖ్యాబలం 22కు చేరింది.ఈ క్రమంలోనే నలుగురు కౌన్సిలర్లు తిరిగి వైసీపీలో చేరి తమకే ఛైర్మన్ పీఠం ఇవ్వాలని వైసీపీ అధిష్టానం ముందు డిమాండ్లు పెట్టారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైసీపీ అధిష్టానం పెద్దలు మున్సిపాలిటీని చేజిక్కించుకోవడానికి ఆసక్తి చూపలేదు. వైసీపీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకోకపోవడం, నెంబర్ గేమ్ ఆసక్తికరంగా మారింది. పార్టీ పవర్‌లో లేకపోవడంతో మరికొందరు వైసీపీ కౌన్సిలర్లు తమ రాజకీయ భవిష్యత్తు కోసం టీడీపీలో చేరిపోయారు. ప్రస్తుతం 22 మంది మద్దతుతో మున్సిపల్ చైర్మన్ పీఠం టీడీపీ కైవసం చేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.అటు కుప్పం..ఇటు హిందూపురం రెండు మున్సిపాలిటీల్లో పాగా వేసే ప్లాన్ చేస్తుంది టీడీపీ. రాయలసీమ జిల్లాల్లోని మున్సిపాలిటీలను కైవలం చేసుకుని..వైసీపీ షాక్ ఇచ్చేందుకు వర్కౌట్ చేస్తోంది. అందులో భాగంగా ముందు హిందూపురం..తర్వాత కుప్పం..ఆ తర్వాత మిగతా మున్సిపాలిటీల్లో పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

# భార్గవరెడ్డి చుట్టూ ఉచ్చు

విజయవాడ, నవంబర్ 11, వైసిపి ప్రభుత్వంతో పాటు పార్టీలో సజ్జల రామకృష్ణారెడ్డి పాత్ర అందరికీ తెలిసిందే. జగన్ తర్వాత అంతటి పాత్రను పోషించారు ఆయన. అంతటితో ఆగకుండావైసీపీ సోషల్ మీడియా ఇన్చార్జ్ బాధ్యతలను తన కుమారుడు భార్గవరెడ్డికి అప్పగించారు.అయితే వైసిపి సోషల్ మీడియా అరాచకాలు బయటపడుతుండడంతో ఇప్పుడు భార్గవరెడ్డి చుట్టూ ఉచ్చు బిగుసుకునే అవకాశం కనిపిస్తోంది.ఏపీ వ్యాప్తంగా వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధులపై కేసులు నమోదవుతున్న సంగతి తెలిసిందే. అరెస్టులు కూడా ప్రారంభమయ్యాయి. ప్రధానంగా సోషల్ మీడియాలో వైసీపీకి అనుకూలంగా ఉంటూ.. జగన్ పై విమర్శలు చేసే వారిని టార్గెట్ చేసుకునేవారు. టిడిపి తో పాటు జనసేన కీలక నేతలపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టేవారు. ఆ కుటుంబాల్లో మహిళలను సైతం బయటకు లాగే వారు. లేనిపోని అసత్య కథనాలు అల్లేవారు. అటువంటి వారిని కూటమి ప్రభుత్వం టార్గెట్ చేసుకుంది. ఈ విషయంలో వర్రా రవీందర్ రెడ్డి ముందు వరుసలో ఉండేవారు. వైసిపి కీలక నేత కుటుంబానికి సహాయకుడిగా వ్యవహరించి రవీందర్ రెడ్డి.. సోషల్ మీడియాలో కీలక భూమిక పోషించేవారు. అనుచిత వ్యాఖ్యలతో ప్రత్యర్థులపై విరుచుకుపడేవారు. జుగుప్సాకరమైన పదజాలాలతో.. సభ్య సమాజం తలదించుకునేలా పోస్టులు పెట్టేవారు. అందుకే ఏపీ పోలీసులుఆయనను అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యంగా వైసిపి సోషల్ మీడియా విభాగంలో పనిచేసే రాష్ట్ర స్థాయి నేతలపై పోలీసులు ఫోకస్ పెట్టారు. ఈ నేపథ్యంలో అర్జున్ రెడ్డి అనే నేత తెరపైకి వచ్చారు. ఆయనపై సైతం నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు వైసీపీ సోషల్ మీడియా ఇన్చార్జిగా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు, భార్గవరెడ్డి పై సైతం కేసు నమోదైనట్లు తెలుస్తోంది. ఆయన చుట్టూ ఉచ్చు బిగిస్తున్నట్లు సమాచారం. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలానికి చెందిన హరి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భార్గవ రెడ్డితో పాటు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేశారు పోలీసులు. వర్రా రవీందర్ రెడ్డి, అర్జున్ రెడ్డి, సజ్జల భార్గవ్ రెడ్డి పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పులివెందుల పోలీసులు తెలిపారుసింహాద్రిపురం మండలానికి చెందిన హరి అనే వ్యక్తి దళితుడు. ఆయన వైసీపీ విధానాలతో పాటు జగన్ వైఖరిపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. దీనిపై వర్రా రవీందర్ రెడ్డి తో పాటు అర్జున్ రెడ్డి తనను కులం పేరుతో దూషించారంటూ హరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోషల్ మీడియా ఇన్చార్జిగా ఉన్న భార్గవరెడ్డి తో పాటు ఆ ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే రవీందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అటు అర్జున్ రెడ్డిని అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

# వైసీపీ నేతలపై వేటు తప్పదా..

కడప, నవంబర్ 11, కూటమి ప్రభుత్వం ఏర్పటి నిండా అయిదు నెలలు కాలేదు. అప్పుడే ఎన్నికలు దగ్గరపడ్డట్లు .. మళ్లీ అధికారంలోకి వచ్చేది తామేనని అప్పుడు అందరి లెక్కలు తేలుస్తామని జగన్ హెచ్చరిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలా వ్యవహరించారలో ఇప్పుడు కూడా అదే ఒంటెద్దు పోకడ పోతూ సొంత పార్టీ వారి నుంచే విమర్శలు మూటగట్టుకుంటున్నారు. వరుసగా అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకపోతే అనర్హత వేటు పడుతుందని తెలిసి కూడా తన పార్టీ అసెంబ్లీని బాయ్‌కాట్ చేస్తుందని ప్రకటించి వైసీపీ ఎమ్మెల్యేలను ఉలిక్కిపడేలా చేశారు.వైసీపీ అధ్యక్షుడు జగన్ లో ఓటమి తర్వాత కూడా మార్పు కనిపించడం లేదు. ఘోర పరాజయం తర్వాత కూడా సొంత పార్టీ వారికి కనీస వాల్యూ ఇవ్వడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు ఎలా ఉన్నారో ఓటమి తర్వాత కూడా అలాగే ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారన్న విమర్శలు వైసీపీలోనే వినపడుతున్నాయి. జగన్ ఎక్కువ సమయం ఒంటరిగా ఉండటానికే ఇష్టపడుతున్నారు. ఆయనకు పార్టీ విషయాలను, నిర్ణయాలను నేతలతోపంచుకునే ఉద్దేశ్యం లేనట్లే కనిపిస్తుంది. ఏ పార్టీలోనైనా నాయకుడు పార్టీ నేతలతో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటారు. ప్రాంతీయ పార్టీల్లోనూ పొలిట్ బ్యూరోలు వంటివి ఉంటాయి. వైసీపీలో ఇవేమీ కనిపించవు. ముందు నుంచి అంతే. జగన్ అనుకున్నది అనుకున్నట్లే జరగాలి. తాజాగా ఆయన తీసుకున్న రెండు నిర్ణయాలు మరోసారి ఆయన వైఖరిని స్పష్టం చేస్తున్నాయి. అదే వైసీపీలో చర్చనీయాంశంగా మారింది. తలపండిన సీనియర్ నేతలు ఎందరో వైసీపీలో ఉన్నారు. వారందరినీ సంప్రదించి నిర్ణయాలు తీసుకునే సంప్రదాయం మాత్రం వైసీపీలో లేదు. అదే అనేక మంది నేతలకు రాజకీయంగా ఇబ్బందిగా మారిందంటున్నారు . పలువురు సీనియర్లు పార్టీని వీడి పోతున్నా.. జగన్ ఏకపక్ష ధోరణి మాత్రం మానుకోవడం లేదు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు జగన్ ప్రకటించారు. ఇక అసెంబ్లీ సమావేశాలను తనతో పాటు ఎమ్మెల్యేలు కూడా బహిష్కరిస్తారని పేర్కొన్నారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు గుంటూరు, కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను వైసీపీ బహిష్కరించింది. అందుకు కార్యకర్తల అరెస్టులను కారణంగా పేర్కొంది. అయితే గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన తర్వాతనే టీడీపీకి ఊపిరి వచ్చిందన్న విషయాన్ని వైసీపీ అధ్యక్షుడు మర్చిపోయారు. ఆ క్రమంలో జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని స్పష్టమైందంటున్నారు.ఇక అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండాలని జగన్ ఫిక్స్ అయ్యారు. 2024 శాసనసభ ఎన్నికల్లో వైసీపీ నుంచి పదకొండు మంది మాత్రమే గెలిచారు. వారితో ఏమాత్రం సంప్రదించకుండా ఒక ప్రెస్ మీట్ పెట్టి తాము అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉన్నామని ప్రకటించడం పార్టీలో చర్చనీయాంశమైంది. సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యేలలో కూడా ఈ నిర్ణయం కొంత అసంతృప్తికి దారి తీస్తుంది. కానీ జగన్ మాత్రం అధికారంలో ఉన్న తరహాలోనే వ్యవహరిస్తున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి.అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీగా తాము తప్ప వేరే వారు లేరని.. తమను ప్రతిపక్షంగా ఎందుకు గుర్తించడం లేదని వైసీపీ అధినేత జగన్ ప్రశ్నించారు. తమను ప్రతిపక్షంగా గుర్తించనపుడు అసెంబ్లీకి వెళ్లి లాభమేంటన్నారు.

## కోడుమూరు అసెంబ్లీ లో బిజెపి సభ్యత్వ నమోదు:- వేల్పులగోపాల్





విభారే న్యూస్ నవంబర్ 11 కర్నూలు ప్రతినిధి.కర్నూలు జిల్లా కోడుమూరు అసెంబ్లీ గూడూరు (అర్బన్) రూరల్ మండలం క్రియశిల సభ్యత్వం వేల్పులగోపాల్ అందజేశారు అనంతరం మాట్లాడుతూ క్రియశీల సభ్యత్వంలను వెంటనే పూర్తి చేసి మన భారత ప్రధాని శ్రీ నరేంద్రమోడి ప్రవేశ పెట్టిన పతకాలు మరియు బిజెపి టిడిపి జనసేన కూటమి ప్రభుత్వం అందించే పతకాలు ప్రతి గ్రామంలోని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు ఈకార్యక్రమంలో జిల్లా ప్రధనకార్యదర్శి మల్లేష్ నాయుడు యువ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు రాజు గూడూరు అర్బన్ మండల అధ్యక్షుడు గోరంట్ల ఈశ్వరయ్య నిలప్ప ఆనంద్ మధు తారక్ రాముడు నరసింహులు కృష్ణయ్య యేసు తదితర నాయకులు పాల్గొన్నారు.

## కార్తీక సోమవారం సందర్భంగా గౌరీ శంకర స్వామికి రుద్రాభిషేకము...



విభారె న్యూస్ నవంబర్ 11 కర్నూలు జిల్లా ప్రతినిధి..కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ గౌరీ శంకర స్వామి వారికి ప్రాతఃకాలం నుండి లఘున్యాస పూర్వకంగా రుద్రాభిషేకములు విశేష అర్చనలు జరిగినవి. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాల స్వీకరించారు.

## విస్తృత స్థాయి లో ఆప్టా సభ్యత్వ నమోదు కార్యక్రమం..

విభారె న్యూస్ కర్నూలు జిల్లా ప్రతినిధి నవంబర్ 11:సోమవారం రోజు మండలంలో ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎం మధుసూదన రెడ్డి మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి సేవాలాల్ నాయుక్ అధర్వ్యంలో ఎమ్మిగనూరు మండలంలో బనవాసి,కోటేకల్, చెన్నపురం, దేవిబెట్ట, బోడబండ మొదలైన గ్రామాల యందు వున్న పాఠశాల లో ఆప్టా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేయబడింది. ఈ సందర్బంగా పై గ్రామాల యందు పని చేయుచున్న ఉపాద్యాయ సిబ్బంది అందరూ ఆప్టా సభ్యత్వం తీసుకున్నారు. ఆప్టా సంఘం నాయకులు ఉపాధ్యాయ సమస్య ల పై చేస్తున్న విస్తృత ప్రాతినిథ్యం ల వలన అనేక సమస్య లు తీరుతున్నాయి అని ఉపాద్యాయులు ప్రశంసించడం జరిగింది.



ఈ సందర్బంగా జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతు ఉపాద్యాయులు తమ యొక్క సమస్యల పరిష్కారం కొరకు కర్నూలు కు రావాల్సిన అవసరం లేదు అని వారు తమ యొక్క సమస్య లను ఫోన్ ద్వారా చెప్పిన పరిష్కారం చేస్తాం అని,జిల్లా అధ్యక్షుడు అయిన తన నంబర్ 9704040543 కి కానీ జిల్లా ప్రధాన కార్యదర్శి సేవా లాల్ నాయక్ 9550855099 కు 24 గంటల లో ఎప్పుడైనా సంప్రదించవచ్చు అని చెప్పారు. ఈ కార్యక్రమము లో ఆ ప్టా రాష్ట్ర నాయకుడు గోపాల్ కుడా పాల్గొనడం జరిగింది.

# విద్యారంగంలో సంస్కరణలను ప్రారంభించి, నూతన విద్యా విధానానికి పునాది వేసిన మహనీయులు భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్




**- ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దిన్**

ముజమ్మిల్. విభారే న్యూస్ కర్నూలు, ప్రతినిధి నవంబర్, 11 : విద్యారంగంలో సంస్కరణలను ప్రారంభించి, నూతన విద్యా విధానానికి పునాది వేసిన మహనీయులు భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దిన్ ముజమ్మిల్ అన్నారు. నేడు ఉస్మానియా కళాశాలలో 'జాతీయ విద్యా దినోత్సవం' మరియు 'మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. గొప్ప మేధావి, సంస్కర్త, ఆలోచనపరుడైన అబుల్ కలాం ఆజాద్ విద్యారంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని, ఉన్నత విద్యలో వారు ప్రవేశపెట్టిన అనేక సంస్కరణలు విద్యాభివృద్ధికి దోహదం చేశాయని అన్నారు. భారతదేశానికి మొదటి విద్యా శాఖ మంత్రిగా వారు చేసిన సేవలు, ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక విద్యతోపాటు విద్యార్థులు సంపూర్ణ వికాసానికి దోహదపడే అనేక అంశాలు విద్యా విధానంలో చేర్చారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్.మండి అన్వర్ హుస్సేన్ మాట్లాడుతూ, రాయలసీమ విద్యాభివృద్ధికి, మైనారిటీ కళాశాలగా ప్రారంభమైన ఉస్మానియా కళాశాల ఈ రెండు అంశాలకు సరైన న్యాయం చేకూరుస్తుందని, విద్యార్థులకు భారత రాజ్యాంగ విలువలతో పాటు, సంపూర్ణ వికాసానికి తోడ్పడే విధంగా విద్యా బోధన జరుగుతోందని తెలిపారు. వ్యాఖ్యాతగా పర్షియన్ శాఖ అధ్యక్షులు హాఫిజ్ అబ్దుల్ వహాబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర శాఖ అధ్యక్షులు ఏ.ఆబిద్ అలీ, ఉర్దూ శాఖ అధ్యక్షులు అబ్దుల్ కరీం సాజిద్, అరబిక్ శాఖ అధ్యాపకులు మొహమ్మద్ సుహేల్, కామర్స్ శాఖ అధ్యక్షుడు షేక్ రసూల్, అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివి..



**- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పరిగెల మురళీకృష్ణ.**

విభారె న్యూస్ నవంబర్ 11 కర్నూలు జిల్లా ప్రతినిధి..మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు భారత జాతి ఎన్నటికీ మరువలేదని జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే,టీటీడీ బోర్డు మాజీ మెంబర్ పరిగెల మురళీకృష్ణ అభిప్రాయపడ్డారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136 వ జయంతి కార్యక్రమం సందర్భంగా ముందుగా డిసిసి అధ్యక్షులు పి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాల నందు టిబి వార్డులో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసిన అనంతరం పార్టీ కార్యాలయంలో ఆజాద్ చిత్ర పటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కార్యకర్తల సమావేశంలో మురళీ కృష్ణ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారని 1940 సంవత్సరంలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా పని చేశారని, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యాడని,ఖిలాఫత్, సహాయ నిరాకరణ, క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొని పది సంవత్సరాలు జైలు జీవితం గడిపారని స్వాతంత్ర్యా నంతరం భారత మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేశారని, విద్యార్థుల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి విద్యాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ కృషి చేశాడని అందుకే ఆయన పుట్టిన రోజును జాతీయ విద్యా దినంగా జరుపు కుంటున్నామని ఆయన మరణానంతరం భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించిందని. మౌలానా స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలని,ఆయన కీర్తి చిరకాలం నిలవాలని మురళీ కృష్ణ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎన్సీ బజారన్న,షేక్ ఖాజా హుస్సేన్,ఎన్ చంద్రశేఖర్, కే నాగశేషులు,డి వి సాంబశివుడు,డబ్ల్యా సత్యరాజు,ఖాద్రిపాషా,బి సుబ్రహ్మణ్యం,పగిడాల అమన్,ఎన్ సుంకన్న, ఎస్ ప్రమీల,ఏ వెంకట సుజాత, కరుణమ్మ,తిప్పన్న నాయుడు,ప్రతాపరెడ్డి రమేష్, కే రవి, ఆర్ ప్రతాప్,అక్బర్ మహిళా కాంగ్రెస్ అయ్యమ్మ, సుజాత మొదలగువారు పాల్గొన్నారు.

# నవంబరు 14వ తేది నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

విభారే న్యూస్ కర్నూలు, ప్రతినిధి నవంబరు, 11 : నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్ (ఔఅఆ) 3.0 సర్వేలో భాగంగా నవంబరు 14వ తేది క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయడం జరుగుతుందని, తద్వారా ముందుగానే క్యాన్సర్ ను గుర్తించి నివారించుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.×సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్ 3.0 క్యాన్సర్ స్క్రీనింగ్ కు సంబంధించిన "క్యాన్సర్ ను నివారించవచ్చు" పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవంబరు 14వ తేది నుంచి రాష్ట్రంలో మరియు జిల్లాలో నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్ 3.0 సర్వే మరియు చిల్డ్రన్ సర్వే కూడా చేయడం జరుగుతుందన్నారు. క్యాన్సర్ పరీక్షల్లో భాగంగా సర్వైకల్, బ్రెస్ట్, ఓరల్ క్యాన్సర్లను పరీక్షించడం జరుగుతుందని, అందుకు అవసరమైన కిట్స్ జిల్లాకు రావడం జరిగిందని, వాటిని పి హెచ్సీ లకు పంపుతున్నామన్నారు.. నాన్-కమ్యూనికేబుల్ డిసీజ్ 3.0 సర్వే లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎఎన్ఎం, సిహెచ్ఓ, ఆశ అదే అర్బన్ లో ఎఎన్ఎం, ఆశ ఇంటింటికీ వెళ్లి సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వే ద్వారా 18సం.లు పై బడిన వారందరినీ పరీక్షించడం జరుగుతుందన్నారు. ఆర్బిఎస్కె చిల్డ్రన్ స్క్రీనింగ్ (రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం) ద్వారా 6 నెలల నుంచి 18 సం.ల విద్యార్థుల వరకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన హెల్త్ కార్డ్స్ పంపడం జరిగిందన్నారు.. పిల్లలు అందరూ స్క్రీనింగ్ పాఠశాలకు/అంగన్వాడీ కేంద్రానికి హాజరు అయ్యేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లల్లో ఏమైనా సమస్యలు గుర్తిస్తే వారిని డిఐసిలకు (డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెంటిన్ సెంటర్లకు) (ఆదోని, జిజిహెచ్ కర్నూలు)లకు రెఫర్ చేయడం జరుగుతుందన్నారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, డిఎం హెచ్ఓ డా.ఎల్.భాస్కర్, ఆర్బిఎస్కె కోఆర్డినేటర్ హేమలత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## మహానందీశ్వరునికి భక్తులు విరాళాలు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 11- మహానందీశ్వరునికి సోమవారం భక్తులు వివిధ రకాల విరాళాలు ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి కి అందజేశారు. మసీదుపురం గ్రామానికి చెందిన శ్రీనివాస రెడ్డి



. వెంకటేశ్వర పాలిమర్స్ వ్యాపార సంస్థ వారు శ్రీ మహానందీశ్వర స్వామి వారి అన్నప్రసాదమునకు 101116 రూ. విరాళముగా అందజేశారు. నంద్యాల వాసి కూరాకు కృష్ణ మూర్తి దంపతులు 34 వేలు. అన్న ప్రసాదమునకు అందజేశారు. మరియు కర్నూలు జిల్లా పెద్దపాడు గ్రామం వాస్తవ్యులు లోకేష్ రెడ్డి మాధవి దంపతులు శ్రీకామేశ్వరీఅమ్మవారికి 17.5 గ్రాముల బంగారు కాసుల దండ అందజేశారు. ఈ కార్యక్రమం లో ఆలయ వేద పండితులు దేవస్థానం అధికారులు తదితరులు ఉన్నారు.

## కార్తీక శుద్ధ చతుర్దశి 14 వ తేదీ గురువారం ధాత్రి యజ్ఞం, వనభోజనం..




విభారె న్యూస్ నవంబర్ 11 ఎమ్మిగనూరు.పట్టణ,గ్రామీణ ఆర్యవైశ్య సంఘ సోదర, సోదరీమణులకు 14-11-2024 తేది న గురువారం కార్తీక శుద్ధ చతుర్దశి శుభ సందర్భంగా ఉదయం 10-02 ని.లకు మొదలు ధాత్రి యజ్ఞ పూజ కళ్యాణ మహోత్సవం వనభోజనం కార్యక్రమం శ్రీ వాసవి కళ్యాణ మండపం నందు జరుగును. 12-11-2024 తేది మంగళవారం రాత్రి 9 గంటల వరకు వనభోజనం టికెట్లు ఇవ్వబడును.(కేవలం 2 రోజులు మాత్రమే ఉన్నది). శ్రీ వాసవి కళ్యాణ మండపం నందు వన భోజనం టికెట్లు ఇవ్వబడునని ధాత్రి వన భోజనం టికెట్లు దొరకు స్థలము...1)శ్రీ పాండురంగ ఫ్యాన్సీ స్టోర్స్.( మున్సిపల్ కాంప్లెక్స్)2) శ్రీ శ్రీనివాస టూరిస్ట్( పాన్ షాప్ బస్టాండ్ ఎదురుగా)3) శ్రీ లక్ష్మి వెంకటరమణ జనరల్ స్టోర్స్( సంత మార్కెట్ దగ్గర )దాత్రి యజ్ఞ పూజ, వనభోజన కార్యక్రమంలో సంఘ సభ్యులందరూ పాల్గొంటూ ఆ మహా ఈశ్వరని అనుగ్రహం పొందుతూ,స్వామివారి కృపకు పాత్రలగుదురని కోరారు. ఆర్యవైశ్య సంఘ సభ్యులందరూ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా సంఘం వారు కోరారు.

## దేశాభివృద్ధికి మౌలాన అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

**---జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

---విభారె న్యూస్ నంద్యాల భ్యూరో నవంబర్ 11-దేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర సమరయోధులు భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ టౌన్ హాల్ లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ ప్రగతికి, దేశ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. అరబిక్, ఇంగ్లీష్, ఉర్దూ, బెంగాలీ, హిందీ తదితర ఎన్నో భాషలు నేర్చుకోవడంతోపాటుతత్వశాస్త్రము, గణితము, చరిత్రలను అభ్యసించి తొలి విద్యాశాఖ మంత్రిగా దీర్ఘకాలం పనిచేసి దేశానికి విశిష్ట సేవలు అందించారని కలెక్టర్ కొనియాడారు. హిందూ, ముస్లిం సఖ్యతకు ఎంతో కృషి చేసి అందరూ కలిసిమెలిసి ఉండాలనే లక్ష్యంతో ద హిలాల్ పత్రికను స్థాపించి ఐక్యతకు అబుల్ కలాం ఆజాద్ కృషి చేశారన్నారు. కనీసం డిగ్రీ ఉత్తీర్ణత అయితే అన్ని పోటీ పరీక్షలకు అర్హత సంపాదించుకోవచ్చున్నారు. సోషల్ మీడియాపై ఆధారపడకుండా స్థానిక గ్రంథాలయాలకు వెళ్లి బుక్ రీడింగ్ అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో అన్ని విధాల చురుకుగా ఉండగలిగే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మన జిల్లాలో ఉండడం గొప్ప అవకాశం అని ఉర్దూ పాఠశాలలు, కళాశాలలకు ఉన్న సమస్యలపై మంత్రి మార్గదర్శకాలతో పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన కళా నృత్యాలు ఆహుతులను ఆకర్షణీయంగా ఆకట్టుకున్నాయి. అనంతరం మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటాన్ని ఆవిష్కరించి, గెలుపొందిన పాఠశాల విద్యార్థులకు మెమొంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190